భక్తిశ్రద్ధలతో సొడమ్మ జాతర

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సొడమ్మ జాతరను రెండో రోజు గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక అభిషేకంతో పాటు పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. నగరం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు సొడమ్మ తల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి బోనాలను సమర్పించగా.. మరికొంతమంది అమ్మవారికి బియ్యం పోసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి రోజు అనంతరం సొడమ్మ తల్లి జాతరను నిర్వహిస్తున్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా భారీ ఏర్పాట్లు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేటలో ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోకాపేట వీకర్ సెక్షన్ కాలనీలో ఉంటున్న బాలకృష్ణ(35) కుటుంబ తగాదాలు, ఆర్థిక సమస్యలతో గురువారం తన ఇంట్లోని ఓ గదిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతను ప్రైవేటు సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడని, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

కోటలో పర్యాటకుల సందడి



గోల్కొండ: గోల్కొండ కోట పర్యాటకులతో నూతన శోభను చేకూర్చుకుంది. సంక్రాంతి సెలవులు కావడంతో పెద్ద సంఖ్యలో పర్యాటకులు గోల్కొండ కోటకు వస్తున్నారు. వేల సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులు కోటలోని రావణ దహన మైదానంలో టికెట్ కౌంటర్ ముందు బారులుతీరారు. పర్యాటకులతో కోటలోని బాలహీసార్ ద్వారం, రాణి మహల్ ప్రాంగణం, కుతుబ్‌షాహీ రాజుల కాలం నాటి ఫౌంటెన్ ప్రాంగణం సందర్శకులతో కిటకిటలాడింది. యువకులు, పిల్లలు కోటకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన క్లాపింగ్ పోర్టికో వద్ద భారీ ఎత్తున గుమ్మిగూడి క్లాపింగ్ పోర్టికోను ఎంతో ఆశ్చర్యంగా తిలకించారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించండి

బంజారాహిల్స్: క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు అన్ని శాఖలు సమన్వయంగా ముందుకుసాగాలని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. గురువారం ఖైరతాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, జీహెచ్ఎంసీ, జలమండలి, విద్యుత్, ట్రాఫిక్ పోలీసులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎక్కడెక్కడ ట్రాఫిక్‌కు అడ్డంకిగా స్తంభాలు, వైర్లు, గుంతలు, ఇతరత్రా సమస్యలు ఉన్నాయో వాటిని తొలగించి ట్రాఫిక్ సజావుగా సాగేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. అలాగే రోడ్లపై గుంతలు, మ్యాన్‌హోళ్లు, కాలువలు ప్రమాదకరంగా ఉంటే సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. జీహెచ్ఎంసీ ఇంజినీర్లతో సమన్వయం చేసుకుని పరిస్థితులను చక్కదిద్దాలని వెల్లడించారు.

రోడ్ల విస్తరణ జరిగేదెన్నడో..?

- పెరిగిపోతున్న ట్రాఫిక్
- ఎక్కడికక్కడ ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు
- పట్టించుకోని అధికారులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీలో రోజురోజుకూ జనాభాతో పాటు వాహనాలు పెరిగిపోతున్నాయి. అప్పట్లో ఇంతలా అభివృద్ధి చెందుతుందని ఊహించని రియల్టర్‌లు లేఅవుట్‌లతో పాటు ప్రధాన రోడ్లను సైతం వ్యక్తిగత గృహాలకు సరిపడే స్థాయిలో మాత్రమే వేశారు. సినిమా, రాజకీయ, వ్యాపార, అధికార రంగాల అందరి దృష్టి మణికొండపై పడటంతో తక్కువ కాలంలోనే అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, టవర్‌లు విపరీతంగా వచ్చాయి. వాటిల్లోకి జనం చేరడంతో రాత్రి, పగలు తేడా లేకుండా వాహనాల రద్దీ, ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోయాయి. దీంతో ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రావాలంటే జంకే పరిస్థితి నెలకొంది. హైదరాబాద్ నగరం చుట్టు పక్కల గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక చోట్ల స్లిప్ రోడ్లు, లింక్ రోడ్లు, ఫ్లై ఓవర్‌ల నిర్మాణం చేపట్టినా మణికొండ మున్సిపాలిటీలో మాత్రం బీఆర్ఎస్ పార్టీ అధికారంలో లేకపోవటంతో చిన్నచూపు చూసిందనే ఆరోపణలు ఉన్నాయి. తమకు అనుకూల బిల్డర్‌లకు అవసరమైన ఒకటి, అరా రోడ్ల నిర్మాణాలను చేపట్టి మిగతా వాటిని పక్కన పెట్టిందనే విమర్శలు ఉన్నాయి. దీంతో ప్రజావసరాలకు తగ్గట్టుగా రోడ్ల విస్తరణ, కొత్త రోడ్ల నిర్మాణం కాకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డీపీఆర్‌లు సిద్ధం చేసినా..

మణికొండ మున్సిపాలిటీకి గతంలో కమిషనర్‌గా పనిచేసిన ఫల్గుణ్‌కుమార్ ట్రాఫిక్ సమస్యను తీర్చేందుకు రోడ్ల విస్తరణ చేయాల్సిన అవసరాన్ని అప్పటి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు.



విస్తరణకు నోచుకోని ఓయూ కాలనీ మర్రిచెట్టు రోడ్డు

దీంతో హైదరాబాద్ నుంచి మణికొండ మున్సిపాలిటీకి వచ్చే నాలుగు ప్రధాన రోడ్లను 80 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేసేందుకు 2022 నవంబర్ 1న రూ.60కోట్లతో అభివృద్ధి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో వెంటనే ఓయూ కాలనీ నుంచి మర్రిచెట్టు, షేక్‌పేట నుంచి నార్సింగి రోడ్డు, లంగర్‌హౌస్ రోడ్డు నుంచి నెక్నాంపూర్ మీదుగా అలకాపూర్ చౌరస్తా వరకు, అలిజాపూర్ నుంచి అలకాపూర్ చౌరస్తా వరకు రోడ్లను సర్వేలు చేసి మార్కింగ్‌లు వేసి డీపీఆర్‌లు సిద్ధం చేసి పంపారు. వాటిల్లో ఒక్క అలిజాపూర్ రోడ్డు అభివృద్ధికి నోచుకోగా మిగతా మూడు రోడ్లు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మిగిలిపోయాయి. అంతలోనే ప్రభుత్వం మారడం, పట్టించుకోవాల్సిన నాయకులు రోడ్ల విషయాన్ని పట్టించుకోకపోవటంతో ప్రజలు ట్రాఫిక్ సమస్యతో నిత్యనరకం అనుభవిస్తున్నారు.

ఇష్టారాజ్యంగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు..

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్లు



ఇరుకుగా ఉన్న నెక్నాంపూర్‌లోని రోడ్డు

ఇరుకుగా మారి ప్రజలకు నిత్యనరకం చూపుతున్నా అవేమి పట్టకుండా రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఇష్టారాజ్యంగా ఆక్రమణలు జరిగాయి. వాటిపై షాపులను ఏర్పాటు చేసుకోవడం, సరైన పార్కింగ్ సౌకర్యం లేకుండా షాపులను తెరవడంతో వాటికి వచ్చే వాహనాలు రోడ్లపైనే నిలుపుతున్నారు. దీంతో రోడ్లపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ట్రాఫిక్‌తో నిత్యనరకం..



మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల చౌరస్తాలో ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ నిత్యనరకంగా మారింది. చౌరస్తా దాటాలంటే అరగంటకు పైగా సమయం పడుతుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల వెడల్పు చేయాల్సిన అధికారులు, ప్రభుత్వాలు పట్టించుకోకపోవటంతో సమస్య రోజురోజుకూ పెరిగిపోతుంది. ఇప్పటికైనా చర్యలు చేపట్టకపోతే మణికొండలో నివాసం ఏర్పాటు చేసుకున్నవారు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లే పరిస్థితి వస్తుంది.

– ప్రభాకర్‌రెడ్డి, న్యాయవాది, మణికొండ గార్డెన్

అడ్డగోలు ఆక్రమణలు..



మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్లతో పాటు ఇచ్చి రోడ్లలోను ఇష్టారాజ్యంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలను ఏర్పాటు చేసుకున్నారు. వాటిని తైబజార్ వసూలు చేసే వారే ఏర్పాటు చేయిస్తున్నారు. దీంతో అత్యవసర పనులపై బయటకు వెళ్లే ప్రజలకు నరకం కనిపిస్తుంది. మర్రిచెట్టు సర్కిల్‌లో ఎక్కడ చూసినా షాపులు ఏర్పాటు చేసి ఇరుకుగా మార్చారు. ఫుట్‌పాత్‌లపై వచ్చే ఆక్రమణలను తొలగించాల్సిన ట్రాఫిక్ పోలీసులు, మున్సిపాలిటీ అధికారులు ఆ విషయాన్ని పట్టించుకోవడం మరిచారు.

– లక్ష్మణ్, మణికొండ

ఉన్నతాధికారులను సంప్రదిస్తా..



మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్లను వెడల్పు చేసేందుకు గత ప్రభుత్వం 2022లో రూ.60 కోట్లు కేటాయిస్తూ ఇచ్చిన ఆదేశం నాకు తెలియదు. ఆ విషయాన్ని తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులను రప్పించి పనులు కొనసాగేలా చర్యలు తీసుకుంటా. అప్పటి కమిషనర్‌తో మాట్లాడి వివరాలను తెలుసుకుంటా. ఫుట్‌పాత్‌లపై వచ్చిన ఆక్రమణలను తొలగించేందుకు ఇప్పటి వరకు మున్సిపల్ కౌన్సిల్‌లో ఎలాంటి తీర్మానాలు చేయలేదు. త్వరలోనే వాటిని తొలగించే పనులను చేపడతాం.

– ప్రదీప్‌కుమార్, కమిషనర్, మణికొండ మున్సిపాలిటీ

రాజేంద్రనగర్ డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు

రాజేంద్రనగర్: డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్‌లు మాట్లాడకూడదని రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ ఎ.బాలరాజ్ సూచించారు. రాజేంద్రనగర్ డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు–2025లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ..డ్రైవింగ్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలన్నారు. రోడ్డు మధ్యలో ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించడం లాంటివి చేయకూడదని..కేవలం బస్సులను బస్ బేలో మాత్రమే ఆపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బద్రీనారాయణ, మెకానికల్ ఇంజినీర్ నీలిమ, ఎస్‌టీఐ సుశీల, ట్రాఫిక్ ఎస్సై జి.రాజేందర్ గౌడ్, ట్రాఫిక్ ఏఎస్సై రవీందర్ రెడ్డి, డిపో సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలరాజ్

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

ఉస్మానియా వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం సూచించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో రెండురోజుల అంతర్జాతీయ సదస్సును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ పరివర్తన విశేషమైన పరిణామం గురించి, అక్షరాస్యత అడ్డంకులను అధిగమించి సమాజంలోని అన్ని వర్గాలలో దాని పురోగతిని సాధించేలా ముందుకు సాగాలన్నారు. పరిశోధన, ఆవిష్కరణలు, సాంకేతికతతో ముఖ్యంగా కృత్రిమ మేధస్సుతో వ్యవహరించేటప్పుడు అపరిష్కృత సమస్యలపై దృష్టిపెట్టాలని విద్యావేత్తలు, విద్యార్థులకు ఆయన సూచించారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడమే కాకుండా ఆలోచించడం ప్రారంభించాలని కోరారు. 'మనూ'లో వివిధ రంగాలలో చేపట్టే కార్యక్రమాలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం సహకరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. 'మనూ' ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి. ఫజల్ రహమాన్ మాట్లాడుతూ విద్య, పరిశ్రమల మధ్య సహకారాన్ని ప్రోత్సహించడంలో సాంకేతిక ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఓయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం

వచ్చే విద్యాసంవత్సరం నుంచి సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ కోర్సు ప్రారంభం

– 'మనూ' రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్

వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'మనూ'లో సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ ప్రారంభించబోతున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ ప్రకటించారు. ఇది మల్టీ డిసిప్లినరీ విధానంతో కూడిన కోర్సును స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కింద నిర్వహించబడుతుందన్నారు. ఇంజినీరింగ్‌లో డాటా సైన్స్, కంప్యూటర్ సైన్స్, సమాచార విభాగంలో అంతర్జాతీయ స్థాయి అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా 'మనూ' ప్రొఫెసర్లు అబ్దుల్ వాహిద్, ప్రదీప్‌కుమార్, జమీల్ అహ్మద్, అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారి, గులామ్‌నబీ, బిస్వజిత్ బ్రహ్మచ ఎం.ఏ.హమీద్, సయ్యద్ ఇంతియాజ్ హసన్ ప్రసంగించారు.

టీకన్సల్ట్‌తో సమగ్ర ఆరోగ్య సేవలకు ఆస్కారం

రాయదుర్గం: టీకన్సల్ట్‌తో సమగ్ర ఆరోగ్య సేవలు అందించటానికి ఆస్కారం లభిస్తుందని టీ కన్సల్ట్ చైర్మన్ సందీప్ కుమార్‌మక్తాల అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్ ప్రాంగణంలో టీకన్సల్ట్ సమగ్ర ఆరోగ్య కార్యక్రమాని ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అలోపతి, ఆయుర్వేదం, నేచురోపతి, హోమియోపతి వంటి వివిధ వైద్య పద్ధతులను సమన్వయంగా కలిపి సమగ్ర ఆరోగ్య సేవలు అందించడానికి కృషి చేస్తుందన్నారు. ఇది మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహిస్తూ అంతర్జాతీయ రోగులకు భారతీయ సంప్రదాయ వైద్య విధానాల గొప్పతనాన్ని పరిచయం చేయడానికి మంచి అవకాశమన్నారు. భారతీయ సంప్రదాయ వైద్య విధానాలను ప్రపంచానికి అందించడానికి ఇది ఒక మంచి వేదికగా నిలుస్తుందన్నారు. 63 దేశాలకు తమ కార్యకలాపాలను విస్తరించిన టీఐహెచ్ఎస్ ప్రపంచ ఆరోగ్య వ్యవస్థలను పునర్ నిర్వహించేందుకు సిద్ధమైందన్నారు. ఈ విశాల దృక్పథానికి మద్దతుగా ఇప్పటికే 100కు పైగా వైద్య నిపుణులు భాగస్వాములయ్యారన్నారు. టీఐహెచ్ఎస్ ద్వారా టీకన్సల్ట్ ఆధునిక వైద్యాన్ని భారతీయ సంప్రదాయ వైద్య పద్ధతులతో మిళితం చేస్తూ, రోగులకు సమగ్ర ఆరోగ్య అనుభవాన్ని అందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం సమగ్ర ఆరోగ్య సేవల రూపకల్పనలో భారతదేశాన్ని ఆధునిక సంప్రదాయ వైద్య పద్ధతుల నాయకుడిగా నిలిపేందుకు టీకన్సల్ట్ కట్టుబడి ఉందన్నారు.

వాహనదారులకు అవగాహన

లంగర్‌హౌస్: వాహనాలు నడిపే సమయంలో నిర్లక్ష్యాన్ని వీడి ప్రమాదాల నివారణకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని లంగర్‌హౌస్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య అన్నారు. జాతీయ రహదారి భద్రతా ఉత్సవాల్లో భాగంగా లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీసులు వివిధ ప్రాంతాల్లో వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా హెల్మెట్ ధరించని వారికి చలాన్లు విధించి, వెనక కూర్చున్న వారికి కూడా హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు. రూల్స్ పాటించిన వారికి గులాబి పువ్వు ఇస్తూ అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ అంజయ్య మాట్లాడుతూ..ఒకరి నిర్లక్ష్యం వల్ల ఎదుటి వారు కూడా ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న గాంధీ శిల్ప బజార్‌లో భాగంగా గురువారం నాట్యగురువు చంద్రశేఖర్ శిష్య బృందంచే ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన సందర్శకులను కట్టిపడేసింది. ఇందులో తాండవ నృత్యకారి, బ్రహ్మాంజలి, సరస్వతి కీర్తన, భామకలాపం తదితర అంశాలను కళాకారులు అమూల్య, స్నిగ్ధ, సురభి, మహాలక్ష్మి, వాసుకి, అక్షర, రిత్విక్, వసుధ తదితరులు పాల్గొని నృత్యాభినయంతో ఆకట్టుకున్నారు.



అలాగే ప్రణవి తుమ్మాటి శిష్య బృందంచే కూచిపూడి ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. మూషిక వాహన, మీనాక్షి పంచరత్న, గరుడ గమన, ముద్దుగారే యశోద, ఇదిగో భద్రాద్రి అంశాలను కళాకారులు శ్రీవిద్య, సహస్ర, ఆర్షి, సమన్విత, నక్షత్ర, శాన్వి, రితిక తదితరులు ప్రదర్శించి అలరించారు.

కొత్త రేషన్ కార్డుల సర్వే షురూ



శంషాబాద్‌లో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్



మణికొండలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కమిషనర్, మేనేజర్

మణికొండ: రేషన్‌కార్డులు, ఇందిరమ్మ గృహాలకు దరఖాస్తులు చేసుకున్న ఆశావాహుల నుంచి వారి పూర్తి వివరాలు సేకరించి లబ్ధిదారులు ఎంపిక ప్రక్రియ మొదలయ్యింది. గురువారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో చేపట్టిన ఎంపిక ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, మేనేజర్ శ్రీధర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్ని సూచనలను పాటిస్తూ లబ్ధిదారులను ఎంపిక చేయాలని తమ సిబ్బందికి సూచించారు. వార్డు అధికారులు, బిల్ కలెక్టర్‌లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యానగర్‌లో సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ జాగీరులో..

బండ్లగూడ: కొత్త రేషన్ కార్డులు లబ్ధిదారుల సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తామని బండ్లగూడ జాగీరుమున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. గురువారం 1వ డివిజన్‌లోని విద్యానగర్ కాలనీ, 2వ డివిజన్‌లోని గంధంగూడ, 3వ డివిజన్‌లోని మాధవీనగర్ కాలనీల్లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించాలని ఫీల్డ్ వెరిఫికేషన్ ఆఫీసర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శంషాబాద్‌లో..

శంషాబాద్: రైతుభరోసా, రేషన్ కార్డులకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం శంషాబాద్ మున్సిపాలిటీలోని శంషాబాద్, ఊట్‌పల్లి, గండిగూడలోని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హులైన వారిని లబ్ధిదారులను ఎంపిక ప్రక్రియను చేపట్టాలని ఆమె సూచించారు. సాగు యోగ్యమైన భూములకు రైతు భరోసా అందించే వాటిపై కూడా రెవెన్యూ, వ్యవసాయ అధికారుల ద్వారా సమాచారం తీసుకోవడంతో పాటు క్షేత్ర స్థాయిలో ఉన్న వాటిని పరిశీలించాల్సిందిగా సూచించారు. అదనపు కలెక్టర్ వెంట రెవెన్యూ, వ్యవసాయ, మున్సిపాలిటీ అధికారులున్నారు.